వానాకాలం.. వాహనాలు భద్రం

- జోరువర్షంలో దూర ప్రయాణాలు వద్దు
- వాహనదారులకు టైర్లపై అవగాహన తప్పనిసరి

కూకట్‌పల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అసలే ఇది వర్షాకాలం.. మన ఆరోగ్యాన్ని ఎంత జాగ్రత్తగా కాపాడుకుంటామో.. మన జీవనంలో భాగమై, కోరుకున్న గమ్యానికి మనల్ని చేర్చే వాహనాల విషయంలోనూ అంతే జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు వాహన రంగ నిపుణులు. నగరంలో ఏ చిన్న వర్షం పడినా రోడ్లన్ని చెరువులను తలపించే విషయం తెలిసిందే. అడుగడుగున బురద.. గుంతలమయమైన రహదారిలో వర్షాకాలంలో వాహనాలు నడపడమంటే ఓ సాహసమనే చెప్పొచ్చు. అయినా ఉరుకుల పరుగుల జీవితంలో బయటకు వెళ్లాల్సిందే. అయితే వర్షాకాంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వాహనాలు భద్రంగా ఉంటాయంటున్నారు మెకానిక్‌లు.



జాగ్రత్తలే ప్రాణ రక్ష..

వర్షాకాలంలో అప్రమత్తతే ప్రాణ రక్ష అంటున్నారు పలువురు నిపుణులు. వాహనాలను చాలా మంది రోడ్లపై, వీధుల్లో, ఇళ్లమధ్య సందుల్లో, పార్కులు, చెట్ల కింద ఎక్కువగా నిలుపుతుంటారు. వర్షాల సమయంలో తగిన రక్షణ లేనందున అవి అకస్మాత్తుగా మొరాయిస్తుంటాయి. వాహనాలపై కొద్దిగా అవగాహన ఉన్న చిన్నపాటి మరమ్మతులు స్వతహగానే చేసుకోగలం. వర్షం పడుతున్న సమయంలో వేగంగా వాహనాలు నడపకూడదు. వేగాన్ని నియంత్రించకుంటే ప్రమాదాలు కొని తెచ్చుకోవడమే అవుతుంది. వర్షాకాలంలో రోడ్లపై వరదనీరు ఎక్కువగా ప్రవహిస్తుంటుంది. వాహన చక్రాలు మునిగిపోయేంత నీరు ఉన్నట్లయితే అటువైపుగా వెళ్లకపోవడమే ఉత్తమం. ఏ మాత్రం అజాగ్రత్త వహించిన ప్రాణాలకే ప్రమాదమని చెబుతున్నారు. అలాంటి వేళ వాహనదారులు వరదనీటి ప్రవాహన్ని చూస్తూ ప్రయాణాలు చేయడం ఎంతో శ్రేయస్కరం.





జోరు వర్షంలో కూకట్‌పల్లి రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు

వానాకాలం జాగ్రత్తలు..

- రోడ్డుపై నీరు ఎక్కువగా ప్రవాహం ఉన్న సమయంలో ఇంజన్ సెల్ఫ్ కొట్టకూడదు.
- వేగాన్ని పూర్తిగా నియంత్రించుకోవాలి.
- వర్షాకాలంలో వాహనాలకు టెఫ్లాన్ కోటింగ్ వేయడం ఎంతో మంచిది.
- వర్షాలకు త్వరగా దెబ్బతినే విడిభాగం సైలెన్సర్. దీనిలోకి నీరు చేరకుండా, బురద వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- తడి తగిలిన వెంటనే శుభ్రపరుచుకోవాలి.
- పెట్రోల్ ట్యాంకులోకి నీరు చేరకుండా చూడాలి. ట్యాంకులోకి నీరు చేరితే వాహనాల విడిభాగాలు దెబ్బతింటాయి. వాహనం బోరుకు వచ్చే అవకాశం ఉంటుంది.
- వర్షాకాలంలో బయటకు వెళ్లిన సమయంలో జోరుగా వర్షం కురుస్తున్న సమయంలో వాహనం ఆపాల్సివచ్చినపుడు కచ్చితంగా మధ్య స్టాండ్ వేయాలి. సైడ్ స్టాండ్‌తో వాహనం కిందపడే అవకాశం ఉంటుంది.
- వర్షపు నీరు ఎట్టిపరిస్థితుల్లో బ్యాటరీలోకి చేరకూడదు. లేదంటే షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- వర్షంలో ప్రయాణించేటప్పుడు టైర్ల అరుగుదలతో జారిపడే ప్రమాదం ఉంటుంది. కొత్త టైర్లు వేసుకోవడం ఉత్తమం.
- వాహనాలు ప్రతి ఒక్కరు అత్యవసర సమయంలో అవసరమైన ఫోన్ నబంర్‌లు పోలీస్‌స్టేషన్, ఫైర్‌స్టేషన్, అంబులెన్స్ వంటి ఫోన్ నంబర్‌లు అందుబాటులో ఉంచుకోవాలి.
- వర్షాకాలంలో వర్షం కురుస్తున్న సమయంలో భార్యపిల్లలతో ద్విచక్రవాహనాలపై దూర ప్రాంతాలకు వెళ్లకపోవడమే ఎంతో ఉత్తమం.
- వర్షాకాలంలో రెయిన్‌కోర్టు ఎప్పుడు అందుబాటులో ఉంచుకోవాలి.

నీటిలో తడిసి వాహనం స్టార్ట్ కాకుంటే ఇలా చేయండి..!

సాధ్యమైనంత వరకు వాహనం ఇంజన్ వర్షం నీటిలో మునగకుండా చూసుకోవాలి. పార్కింగ్‌లో ఉన్న వాహనం వర్షానికి తడిసినపుడు స్టార్ట్ కాదు. ఓ సారి ప్లగ్ తీసి పొడి వస్త్రంతో శుభ్రంగా తుడిచి పెడితే స్టార్ట్ అయ్యే అవకాశం ఉంటుంది. టైర్లు బాగా అరిగిపోతే తడిచిన రోడ్డుపై వాహనం స్కిడ్ కావచ్చు. నెమ్మదిగా వెళ్లడం ఉత్తమం. సాధారణంగా వానాకాలానికి ముందే ఇంజన్, ప్లగ్, బ్రేకులు ఒకసారి చెక్ చేయించుకోవాలి.

- క్రాంతి, మెకానిక్, బాగ్‌అమీర్, కూకట్‌పల్లి



వాహనం తడవకుండా ఉండడమే మేలు



వర్షాకాలంలో వాహనాలు తడవకుండా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పార్కింగ్ చేసే సమయంలో కచ్చితంగా మధ్యస్టాండ్ వేయాలి. దీని వల్ల వర్షంనీరు వాహనంలోకి వెళ్లకుండా ఉంటుంది. ప్లగ్‌లోకి నీరు చేరితే వాహనం ఆగిపోయే ప్రమాదం ఉంది. వానాకాలంలో ద్విచక్ర వాహనదారులు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి.

- షేక్ అహ్మద్, మెకానిక్, కూకట్‌పల్లి

నేడు ప్రజావాణి

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంతో పాటు కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. జీహెచ్‌ఎంసీకి సంబంధించిన రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, పారిశుధ్యం, దోమల బెడద, వీధిదీపాలు, ఇతర ఏ సమస్యలు ఉన్నా జడ్సీ డీసీలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని వారు తెలిపారు. ఆయా కార్యాలయాల్లో జరిగే ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారని వారు చెప్పారు.



గౌతమీనగర్‌లో కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

మూడు రోజుల్లో వీధి దీపాల సమస్య పరిష్కారం

- కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఫతేనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వీధి దీపాల సమస్యను మూడు రోజుల్లో పరిష్కరిస్తానని ఫతేనగర్ కార్పొరేటర్ సతీష్‌గౌడ్ ప్రజలకు హామీనిచ్చారు. ఆదివారం డివిజన్‌లోని గౌతమీనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను స్థానికులు కార్పొరేటర్‌కు వివరించారు. స్పందించిన ఆయన వినాయక చవితి పండుగలోగా కాలనీల్లో వీధి దీపాలకు మరమ్మతులు చేయించి లైట్లు ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. కార్యక్రమంలో కాలనీవాసులు జగదీష్, సత్యనారాయణ, శశి, బసవరాజ్, సత్యం, సుశాంత్, సురేందర్, శేఖర్, ఇమ్రాన్, అబ్దుల్ మాలిక్, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరద నీటి సమస్య పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్

హైదర్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వరద నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ ప్రజలకు హామీనిచ్చారు. ఆల్విన్ కాలనీ డివిజన్ రాఘవేంద్ర కాలనీలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఘవేంద్రకాలనీలో వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. ప్రజలు ఏ చిన్న సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, పోశెట్టిగౌడ్, ఆంజనేయప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రాఘవేంద్రకాలనీలో వరద నీటి సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్



మ్యాన్‌హోల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ బాబూరావు

మ్యాన్‌హోల్ నిర్మాణ పనుల పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ డివిజన్ ప్రగతినగర్‌లో మ్యాన్‌హోల్ నిర్మాణ పనులను ఆదివారం మాజీ కార్పొరేటర్ బాబురావు పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్ నరసింహారెడ్డికి ఆయన సూచించారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి

బాలానగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కార్యాలయాన్ని ఆదివారం ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బాలానగర్, ఫతేనగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. వారినుద్దేశించి హరివర్ధన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పార్టీలో కష్టపడిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేశ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులతో దళిత సంక్షేమ సంఘం సభ్యులు

దళిత సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

బాలానగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దళిత సంక్షేమ సంఘం బాలానగర్ డివిజన్ అధ్యక్షుడిగా కలమూరి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. బాలానగర్ రాజూకాలనీలోని డా.బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో దళిత సంక్షేమ సంఘం డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా చింతా నర్సింగ్‌రావు, కోశాధికారిగా దీప్తి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సంఘం సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ముఖ్య సలహాదారుడు నల్ల విల్సన్, మాజీ అధ్యక్షుడు రాము తదితరులు పాల్గొన్నారు.



ఆల్విన్‌కాలనీ నుంచి మియాపూర్‌కు వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

కేటీఆర్ సభకు తరలివెళ్లిన బీఆర్‌ఎస్ శ్రేణులు

హైదర్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఆదివారం మియాపూర్ నరేన్ గార్డెన్స్‌లో నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆల్విన్‌కాలనీ డివిజన్ నుంచి పార్టీ సీనియర్ నాయకుడు సతీష్‌రావు ఆధ్వర్యంలో నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం లాంటిదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం 34 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న వారు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ సీఎంఆర్‌ఎఫ్ అందేలా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులు, పార్టీ నాయకులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నూతన కార్యవర్గానికి అభినందనలు..

మూసాపేట డివిజన్ అంబేడ్కర్‌నగర్ నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎన్నికైన అధ్యక్షుడు నిఖిల్, ప్రధాన కార్యదర్శి శివ, కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించారు.

మియాపూర్ తరలివెళ్లిన బీఆర్‌ఎస్ నాయకులు..

మియాపూర్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధే ధ్యేయం: కార్పొరేటర్ నర్సింహ

ఓల్డుబోయినపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డివిజన్ అభివృద్ధియే తన ధ్యేయమని కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు. మూడు సార్లు కార్పొరేటర్‌గా గెలిపించిన ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. హస్మత్‌పేట, బోయిన్‌చెరువు కట్టపై జరుగుతున్న వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. చెరువు కట్టపై ఏర్పాటు చేసిన వీధి దీపాలను బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. స్థానికులు, వినాయక మండప నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు డీఈ స్వప్నతో మాట్లాడి 20 వీధి దీపాలను ఏర్పాటు చేయించినట్లు కార్పొరేటర్ నర్సింహ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ కృష్ణ, డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, జనరల్ సెక్రటరీ హరినాథ్, సీనియర్ నాయకుడు జంగయ్య, మహిపాల్ రెడ్డి, నర్సింగ్‌రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వీధి దీపాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహ యాదవ్

143 డెకాయి ఆపరేషన్స్.. 70 మంది అరెస్ట్

- మహిళలు, పిల్లల భద్రతకు సైబరాబాద్ షీ టీమ్స్ ప్రత్యేక చర్యలు
- మానవ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లల భద్రతకు షీ టీమ్స్ బృందాలు ప్రత్యేకంగా పని చేస్తున్నాయి. సైబరాబాద్ పరిధిలో డెకాయి ఆపరేషన్స్ చేపట్టి మహిళలు, పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు వేధింపులకు గురిచేస్తున్న వారిపై దృష్టి సారిస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో 143 డెకాయి ఆపరేషన్స్ నిర్వహించి అసభ్యకరమైన చర్యలకు పాల్పడుతున్న 70 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు సైబరాబాద్ ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కరణం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 47 కేసులు నమోదు చేశామని చెప్పారు. మహిళా బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, వారికి న్యాయం చేసేలా షీ టీమ్స్ పని చేస్తున్నాయని, వివిధ ప్రదేశాల్లో 75 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆమె పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో భార్యాభర్తలకు సంబంధించి సుమారు 34 కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చి, వారిని కలిపేందుకు ప్రయత్నాలు చేసినట్లు తెలిపారు. మానవ అక్రమ రవాణా, పిల్లల అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్య వివాహాలు, పిల్లలహక్కులు, బాలకార్మికులు, యాచించడం, సైబర్ బెదిరింపులు, సైబర్ మోసాలు తదితర అంశాలపై వారం రోజుల్లో పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి అవగాహన కల్పించారని ఆమె వెల్లడించారు. మహిళా బాధితులు హెల్ప్‌లైన్ 181, పిల్లలకు సంబంధించిన సహాయం కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు ఫోన్ చేయాలని డీసీపీ సృజన కరణం సూచించారు.

పీవోటీ చట్టాన్ని రద్దు చేయాలి: శివయ్య

రాంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): 1977 (పీవోటీ) చట్టాన్ని రద్దు చేయాలని, అసైన్డ్ భూములు కలిగిన వారికి ఆ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలని అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసైన్డ్ భూముల్లో సమాన హక్కులను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 16 లక్షల కుటుంబాలకు 20 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయన్నారు. పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములకు భద్రత కల్పిస్తామంటూ 1977లో ఆసైన్డ్ భూములు చట్టం చేశారన్నారు. తద్వారా అసైన్డ్ భూములు అమ్మరాదని, లీజుకు ఇవ్వరాదని, పేరు మార్పిడి చేయరాదని, ఎలాంటి కట్టడాలు, నిర్మాణాలు చేయరాదని నిబంధనలు తీసుకువచ్చారని వివరించారు. 1977 చట్టం వల్ల ఆసైన్డ్ భూముల పట్టాలను పొందిన ఓనర్స్ ఆ భూములపై హక్కులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి ప్రాజెక్ట్ కోసం పేద రైతు నుంచి తీసుకున్న భూములకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. కొందరు అసైన్డ్ భూములను కోల్పోవడం జరిగిందని, వాటిని తిరిగి భూయజమానులకు అప్పగించాలని శివయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బింగి రాములు, సుదర్శన్‌బాబు, ఉప్పరి శ్రీనివాస్, శంకర్, విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివయ్య

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు



కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమాటా 35, వంకాయ 28, బెండకాయ 45, పచ్చిమిర్చి 40, బజ్జిమిర్చి 45, కాకరకాయ 38, బీరకాయ 45, క్యాబేజీ 13, బీన్స్ 85, క్యారెట్ 45, గోబిపువ్వు 30, దొండకాయ 35, చిక్కుడు కాయ 55, గోరుచిక్కుడు 45, బీట్‌రూట్ 25, క్యాప్సికం 45, ఆలుగడ్డ 23, కీర 18, దోసకాయ 15, సొరకాయ 25, పొట్లకాయ 23, కంద 35, ఉల్లిపొరక 28, ఉల్లిగడ్డ 25, మామిడికాయ 15-20, అరటికాయ 10-12, చామగడ్డ 28, ముల్లంగి 6-8, చిలగడదుంప 43, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 16-20, మునగకాయలు 4-5, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 120, వెల్లుల్లి 160, చింతపండు 160, పండుమిర్చి 80, ఉసిరి 105, కరివేపాకు 60, పర్వల్ రూ.60, పల్లికాయ 60, లోబా 23, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు సోమవారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.



చాగంటి ప్రవచనాలకు హాజరైన భక్తులు

ముగిసిన వినాయక వైభవం ప్రవచనాలు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ తొమ్మిదోఫేజ్‌లోని విజయగణపతి ఆలయ ప్రాంగణంలో రెండు రోజులుగా కొనసాగుతున్న వినాయక వైభవంపై చాగంటి ప్రవచనాలు ఆదివారంతో ముగిశాయి. తొలుత విజయ గణపతిని ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. చాగంటి ప్రవచనాలను భక్తులు శ్రద్ధగా విన్నారు. అనంతరం వినాయక వ్రత కల్పం పుస్తకాలను ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు పంపిణీ చేశారు.

చెస్ విజేతలు దీక్షిత, దివిత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ అండర్-13 చెస్ పోటీల బాలికల విభాగంలో దీక్షిత, బాలుర విభాగంలో దివిత్‌రెడ్డి విజేతలుగా నిలిచారు. ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో దివిత్‌రెడ్డి టైటిల్ దక్కించుకోగా, కార్తికేయ రన్నరప్‌గా నిలిచాడు. బాలికల విభాగంలో దీక్షిత విజేతగా నిలవగా, శ్రీషా రన్నరప్‌తో సరిపెట్టుకుంది. హైదరాబాద్ చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ వీరికి ట్రోఫీలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



ట్రోఫీలతో క్రీడాకారులు

డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం

- పలు ప్రాంతాల్లో దాడులు చేసిన ఎక్సైజ్ అధికారులు
- కొకైన్, ఎండీఎంఏ స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ విక్రేతలపై వరుస దాడులు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు నగరంలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో కొకైన్, ఎండీఎంఏ విక్రయిస్తున్న ముఠాలను అరెస్ట్ చేశారు. నాంపల్లి రామ్‌కోట్ ప్రాంతానికి చెందిన మిస్బావుద్దీన్ ఖాన్(35), బంజారాహిల్స్‌కు చెందిన అలీ అస్గర్ గులాబీ (28) బెంగళూరుకు చెందిన మహ్మద్ అజీమ్ వద్ద కొకైన్ కొనేవారు. వీరు బెంగళూరు వెళ్లి అజీమ్ నుంచి గ్రాము కొకైన్ రూ.9వేలకు తెచ్చుకొని, నగరంలో పార్టీలు చేసుకునేవారు. బెంగళూరు వెళ్లి కొకైన్ తెచ్చుకునేందుకు నెల రోజుల క్రితం నగరానికి వచ్చిన అమెరికన్ సిటిజన్ జుబేర్ అలీ కారును తీసుకున్నారు. బెంగళూరులో కొకైన్ తీసుకొని నగరానికి వచ్చిన వీరి గురించి తెలుసుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సిబ్బంది రామ్‌కోట్ ప్రాంతంలో కారును అడ్డుకున్నారు. మిస్బావుద్దీన్, అలీ అస్గర్, జుబేర్ అలీలను అరెస్ట్ చేసి 33.3 గ్రాముల కొకైన్, 4 మొబైల్స్, కారును స్వాధీనం చేసుకున్నారు.

ఖాజాగూడ, శంషాబాద్‌లో ఎండీఎంఏ..

ఖాజాగూడలో ఎండీఎంఏ విక్రయించేందుకు యత్నిస్తున్న నాగుల్ల శివపవన్, దేవట్ట మనోజ్, శ్రీవర్ధన్‌ను ఎస్‌టీఎఫ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. వారి నుంచి 2.07 గ్రాముల ఎండీఎంఏ, రెండు యాక్టివా బైకులు, మూడు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. వీరికి సరఫరా చేసే అలీ పరారీలో ఉన్నాడని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. శంషాబాద్‌లో డ్రగ్స్ విక్రయాలపై నిఘా పెట్టిన ఎక్సైజ్ అధికారులు అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఖయ్యూం నగర్‌కు చెందిన మిర్జాసైఫ్‌అలీ, అత్తాపూర్‌కు చెందిన అబ్దుల్ అబీద్‌ను తనిఖీ చేశారు. వారి వద్ద 5.88 గ్రాముల ఎండీఎంఏ లభించడంతో వారిని అరెస్ట్ చేశారు. మరో నిందితుడు సయ్యద్‌అబ్దుల్ హసన్ పరారీలో ఉన్నాడు.



కార్పొరేటర్ హమీద్‌పటేల్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రేమ్‌నగర్ బి-బ్లాక్ వాసులు

ప్రేమ్‌నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్

గచ్చిబౌలి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్ బి-బ్లాక్‌లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని కార్పొరేటర్ హమీద్‌పటేల్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ ఎ, బి బ్లాక్‌లలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. బస్తీలో ఓపెన్ నాలాల్లో మట్టి పేరుకుపోయిందని, చెత్తాచెదారంతో దుర్గంధం వెదజల్లుతుందని, పోచమ్మ గుడి ప్రాంతంలో నూతనంగా డ్రైన్‌బాక్స్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. రెండు బ్లాకులలో డ్రైనేజీ సమస్య కూడా ఉందని, అండర్‌గ్రౌండ్ పైపులైను నిర్మాణం చేపట్టాలని కోరారు. స్పందించిన కార్పొరేటర్ దశలవారీగా అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



రాఘవేంద్రకాలనీలో సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

వరద నీటి సమస్యను పరిష్కరిస్తాం

హైదర్‌నగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ రాఘవేంద్ర కాలనీలో వరదనీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆదివారం సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరామన్నారు. వర్షపునీటితో పాటు మట్టికూడా రోడ్డుమీదకు రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, దీంతో మట్టిని తొలగించి శుభ్రం చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, పోశెట్టిగౌడ్, ఆంజనేయప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

చందానగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మారిన జీవన శైలితో ప్రజలు అనేక వ్యాధులకు గురవుతున్నారని మెడికవర్ ఆసుపత్రి వైద్యుడు మల్లికార్జున్ అన్నారు. మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో చందానగర్ డివిజన్ అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎత్తు, బరువు, దంత, రక్తపోటు, షుగర్, పల్స్, కంటి, ఊపిరితిత్తుల పరీక్షలు చేశారు. కాలనీవాసులు అధిక సంఖ్యలో హాజరై పరీక్షలు చేయించుకున్నారు. నిత్యం వ్యాయామం, నడకతో పాటు పండ్లు, తృణధాన్యాలు, కూరగాయలతో పాటు ఇతర పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు సూచించారు.

మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలి

చందానగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మిరియాల రాఘవరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 3వేల మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జగదీశ్వర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం సంతోషకరమన్నారు.



అండర్ బ్రిడ్జ్ నీటిలో తేలియాడుతున్న మృతదేహం

రైల్వే అండర్ బ్రిడ్జ్ నీటిలో మృతదేహం

చందానగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): చందానగర్ రైల్వే అండర్ బ్రిడ్జ్ వద్ద నీటిలో అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల కురిసిన వర్షంతో చందానగర్ రైల్వే అండర్ బ్రిడ్జ్ నీటితో నిండింది. ఆ నీటిలో ఆదివారం ఉదయం గుర్తుతెలియని 30-35 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94906 17118, 8712663184 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కాగా అతడి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హత్య చేసి అండర్ బ్రిడ్జ్ నీటిలో పడేశారా లేదా ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయాలపై పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు.

పరిగెడుతున్న మురుగు..

పట్టించుకోని అధికారులు

- తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న సుదర్శన్‌నగర్ కాలనీవాసులు
- దోమల బెడదతో అవస్థలు
- ఫిర్యాదు చేస్తే నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్న సిబ్బంది
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

గచ్చిబౌలి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే చాలు సుదర్శన్‌నగర్ కాలనీలో దుర్గంధభరితంగా మారుతోంది. డ్రైనేజీ పొంగి కాలనీలోని ప్రధాన రోడ్డు మొత్తం మురికి కాలువను తలపిస్తుంది. నెలల తరబడి మురుగు పారడంతో తీవ్ర దుర్వాసన వస్తుందని, ఇళ్లలో ఉండలేని పరిస్థితులు ఉన్నాయని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు నామమాత్రంగా పనులు చేసి వెళ్తారని, ఆ తర్వాత సమస్య తిరిగి ఉత్పన్నమవుతుందని చెబుతున్నారు. సమస్యకు సరైన పరిష్కారం చూపడం లేదని వాపోతున్నారు. ప్రతీ వర్షాకాలంలో ఈ పరిస్థితి ఉంటుందని, పైభాగంలో ఉన్న మసీద్‌బండ, శ్రీరాంనగర్ ప్రాంతాల నుంచి వచ్చే డ్రైనేజీ లైన్లు కాలనీ మధ్యలోనుంచి వేశారని, ఆ లైను తరుచూ లీక్ కావడంతోనే ఈ పరిస్థితి ఉందంటున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దోమల విజృంభణ, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.





సుదర్శన్‌నగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు

తాత్కాలిక చర్యలే తీసుకుంటున్నారు

అధికారులకు ఫిర్యాదు చేస్తే తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నారు తప్ప శాశ్వత చర్యలు తీసుకోవడం లేదు. దుర్వాసన, దోమల విజృంభణ ఎక్కువైంది. నాలాలు తమ పరిధిలో ఉండవని, జీహెచ్‌ఎంసీ అధికారులే చూస్తారని వాటర్ వర్క్స్ అధికారులు చెబుతున్నారు. వాటర్‌వర్క్స్ అధికారుల మాత్రం పట్టించుకోవడం లేదు. జీహెచ్‌ఎంసీ అధికారులు సైతం ఇటువైపు రావడం లేదు.

- శేఖర్‌సాగర్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యుడు

సమస్యను పరిష్కరిస్తాం

తాను బదిలీపై కొత్తగా వచ్చాను. సమస్య మా దృష్టికి రాలేదు. ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యను స్వయంగా పరిశీలిస్తా. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- ప్రశాంతి, ఉపకమిషనర్, శేరిలింగంపల్లి



సమావేశానికి తరలివెళ్తున్న కార్పొరేటర్ రోజాదేవి, నాయకులు



ఆల్విన్‌కాలనీ నుంచి తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

బీఆర్‌ఎస్ సమావేశానికి తరలిన పార్టీ శ్రేణులు

హైదర్‌నగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మియాపూర్ నరేన్‌గార్డెన్స్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి వివేకానందనగర్ డివిజన్ నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ బలంగా ఉందని, కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు.

ఆల్విన్‌కాలనీ నుంచి..

మియాపూర్ నరేన్‌గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి ఆల్విన్‌కాలనీ డివిజన్ నుంచి కార్యకర్తలు తరలివెళ్లారు. సీనియర్ నాయకుడు సతీష్‌రావు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లారు.

నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు..

మియాపూర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా సైనికులకు మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ బలాన్ని, కార్యకర్తల ఐక్యతను నిరూపిస్తూ సమావేశాన్ని ఘన విజయం చేశారన్నారు. రానున్న రోజుల్లోనూ పార్టీ శ్రేణులు ఇలానే ఐక్యతతో ఉంటూ పార్టీ తలపెట్టే ప్రతీ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు.

143 డెకాయి ఆపరేషన్స్.. 70 మంది అరెస్ట్

- మహిళలు, పిల్లల భద్రతకు సైబరాబాద్ షీ టీమ్స్ ప్రత్యేక చర్యలు
- మానవ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లల భద్రతకు షీ టీమ్స్ బృందాలు ప్రత్యేకంగా పనిచేస్తున్నాయి. సైబరాబాద్ పరిధిలో డెకాయి ఆపరేషన్స్ చేపట్టి మహిళలు, పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు వేధింపులకు గురిచేస్తున్న వారిపై దృష్టి సారిస్తున్నారు. గత వారం రోజుల వ్యవధిలో 143 డెకాయి ఆపరేషన్స్ నిర్వహించి అసభ్యకరమైన చర్యలకు పాల్పడుతున్న 70 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో పాటు 47 కేసులు నమోదు చేశామని సైబరాబాద్ ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కరణం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళా బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, వారికి న్యాయం చేసేలా షీ టీమ్స్ పనిచేస్తున్నాయని, వివిధ ప్రదేశాల్లో 75 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని ఆమె పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో భార్యాభర్తలకు సంబంధించి సుమారు 34 కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇచ్చి, వారిని కలిపేందుకు ప్రయత్నాలు చేసినట్లు తెలిపారు. మానవ అక్రమ రవాణా, పిల్లల అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్య వివాహాలు, పిల్లలహక్కులు, బాలకార్మికులు, యాచించడం, సైబర్ బెదిరింపులు, సైబర్ మోసాలు తదితర అంశాలపై వారం రోజుల్లో పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి అవగాహన కల్పించారని ఆమె వెల్లడించారు. మహిళా బాధితులు హెల్ప్‌లైన్ 181,పిల్లలకు సంబంధించిన సహాయం కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు ఫోన్ చేయాలని సూచించారు.

డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం

- పలు ప్రాంతాల్లో దాడులు చేసిన ఎక్సైజ్ అధికారులు
- కొకైన్, ఎండీఎంఏ స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ విక్రేతలపై వరుస దాడులు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు నగరంలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో కొకైన్, ఎండీఎంఏ విక్రయిస్తున్న ముఠాలను అరెస్ట్ చేశారు. నాంపల్లి రామ్‌కోట్ ప్రాంతానికి చెందిన మిస్బావుద్దీన్ ఖాన్(35), బంజారాహిల్స్‌కు చెందిన అలీ అస్గర్ గులాటీ (28) బెంగళూరుకు చెందిన మహ్మద్ అజీమ్ వద్ద కొకైన్ కొనేవారు. వీరు బెంగళూరు వెళ్లి అజీమ్ నుంచి గ్రాము కొకైన్ రూ.9వేలకు తెచ్చుకొని, నగరంలో పార్టీలు చేసుకునేవారు. బెంగళూరు వెళ్లి కొకైన్ తెచ్చుకునేందుకు నెల రోజుల క్రితం నగరానికి వచ్చిన అమెరికన్ సిటిజన్ జుబేర్ అలీ కారును తీసుకున్నారు. బెంగళూరులో కొకైన్ తీసుకొని నగరానికి వచ్చిన వీరి గురించి తెలుసుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సిబ్బంది రామ్‌కోట్ ప్రాంతంలో కారును అడ్డుకున్నారు. మిస్బావుద్దీన్, అలీ అస్గర్, జుబేర్ అలీలను అరెస్ట్ చేసి 33.3 గ్రాముల కొకైన్, 4 మొబైల్స్, ఇన్నోవా క్రిష్టా కారును స్వాధీనం చేసుకున్నారు.

ఖాజాగూడ, శంషాబాద్‌లో ఎండీఎంఏ..

ఖాజాగూడలో ఎండీఎంఏ విక్రయించేందుకు యత్నిస్తున్న నాగుల్ల శివపనవర్, దేవట్ట మనోజ్, శ్రీవర్ధన్‌ను ఎస్‌టీఎఫ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. వారి నుంచి 2.07 గ్రాముల ఎండీఎంఏ, రెండు యాక్టివా బైకులు, మూడు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. వీరికి సరఫరా చేసే అలీ పరారీలో ఉన్నాడని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. శంషాబాద్‌లో డ్రగ్స్ విక్రయాలపై నిఘా పెట్టిన ఎక్సైజ్ అధికారులు అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఖయ్యూం నగర్‌కు చెందిన మిర్జాసైఫ్‌అలీ, అత్తాపూర్‌కు చెందిన అబ్దుల్ అబిద్‌ను తనిఖీ చేశారు. వారి వద్ద 5.88 గ్రాముల ఎండీఎంఏ లభించడంతో వారిని అరెస్ట్ చేశారు. మరో నిందితుడు సయ్యద్‌అబ్దుల్ హసన్ పరారీలో ఉన్నాడు.



నిందితులతో ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బృందం

‘రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి’

గచ్చిబౌలి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు రూ.5వేలు గౌరవ వేతనం, సరఫరా చేసే బియ్యానికి క్వింటాల్‌కు రూ.300 ఇస్తామని కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు చెప్పారని, ఆ హామీలను అమలు చేయాలని రాష్ట్ర డీలర్ల సంఘం సంయుక్త కార్యదర్శి మల్లికార్జున్‌యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తమకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఐదు నెలలుగా డీలర్లు కార్డుల ద్వారా సరఫరా చేసిన బియ్యానికి కమీషన్ ఇవ్వలేదని, వెంటనే బకాయిలు విడుదల చేయాలని ఆయన కోరారు.



చాగంటి ప్రవచనాలకు హాజరైన భక్తులు

ముగిసిన వినాయక వైభవం ప్రవచనాలు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ తొమ్మిదోఫేజ్‌లోని విజయగణపతి ఆలయ ప్రాంగణంలో రెండు రోజులుగా కొనసాగుతున్న వినాయక వైభవంపై చాగంటి ప్రవచనాలు ఆదివారంతో ముగిశాయి. తొలుత విజయ గణపతిని ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. చాగంటి ప్రవచనాలను భక్తులు శ్రద్ధగా విన్నారు. అనంతరం వినాయక వ్రత కల్పం పుస్తకాలను ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు పంపిణీ చేశారు.

చెస్ విజేతలు దీక్షిత, దివిత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): తెలంగాణ అండర్-13 చెస్ పోటీల బాలికల విభాగంలో దీక్షిత, బాలుర విభాగంలో దివిత్‌రెడ్డి విజేతలుగా నిలిచారు. ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో దివిత్‌రెడ్డి టైటిల్ దక్కించుకోగా, కార్తికేయ రన్నరప్‌గా నిలిచాడు. బాలికల విభాగంలో దీక్షిత విజేతగా నిలవగా, శ్రీషా రన్నరప్‌తో సరిపెట్టుకుంది. హైదరాబాద్ చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ వీరికి ట్రోఫీలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



ట్రోఫీలతో క్రీడాకారులు

డివిజన్ అభివృద్ధే ధ్యేయం: కార్పొరేటర్ ముద్దం

ఓల్డుబోయినపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డివిజన్ అభివృద్ధియే తన ధ్యేయమని కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు. మూడు సార్లు కార్పొరేటర్‌గా గెలిపించిన ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. హస్మత్‌పేట, బోయిన్‌చెరువు కట్టపై జరుగుతున్న వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. చెరువు కట్టపై ఏర్పాటు చేసిన వీధి దీపాలను బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. స్థానికులు, వినాయక మండప నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు డీఈ స్వప్నతో మాట్లాడి 20 వీధి దీపాలను ఏర్పాటు చేయించినట్లు కార్పొరేటర్ నర్సింహ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ కృష్ణ, డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, జనరల్ సెక్రటరీ హరినాథ్, సీనియర్ నాయకుడు జంగయ్య, మహిపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు చేసిన విగ్రహాన్ని తీసుకెళ్తున్న భక్తులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మండప డెకరేషన్ ఐటమ్స్

జోరందుకున్న గణపతి విగ్రహాల అమ్మకాలు

భెల్‌కాలనీ,ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది వినాయకుడికి ప్రీతిప్రదమైన బుధవారం నాడు పండుగ వచ్చింది. ఈ క్రమంలో శేరిలింగంపల్లి, మియాపూర్, చందానగర్, బీహెచ్‌ఈఎల్ తదితర ప్రాంతాల్లో విగ్రహాల విక్రయాలు జోరందుకున్నాయి. మరోవైపు విగ్రహాల తయారీదారులు విభిన్న రూపాల్లో రూపొందించిన విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతూ అందంగా తయారు చేస్తున్నారు.

మట్టి గణపతులే మేలు..

మట్టితో చేసిన వినాయకుడిని పూజిస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయని పండితులు చెబుతున్నారు. వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసే వివిధ రకాల ఆకులు, పుష్పాల సువాసనల నుంచి విడుదలయ్యే మిశ్రమ వాయువులను పీల్చడం వల్ల శ్వాస సంబంధిత వ్యాధులు దూరం కావడంతో పాటు మెదడు ఉత్తేజితమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రకృతిసిద్ధమైన మట్టితో చేసిన గణపతి ప్రతిమలను పూజించడం, తిరిగి వాటిని నీటిలో నిమజ్జనం చేయడంతో అవి సులువుగా కరిగిపోయి పంట పొలాలకు చేరడంతో భూములు సారవంతంగా మారతాయంటున్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే పూజించాలి.

పీవోటీ-1977 చట్టాన్ని రద్దు చేయాలి

- అనుభవిస్తున్న వారికే అసైన్డ్ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలి
- తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రోళ్ల శివయ్య

రాంనగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): 1977 పీవోటీ చట్టాన్ని రద్దుచేయాలని, అసైన్డ్ భూములు కలిగిన వారికే ఆ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలని తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్డ్ భూముల్లో సమాన హక్కులను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు దాదాపు 16 లక్షల కుటుంబాలకు సంబంధించినవిగా ఉన్నాయన్నారు. పేదప్రజలకు పంపిణీచేసిన అసైన్డ్ భూములకు భద్రత కల్పిస్తామంటూ 1977లో అసైన్డ్ భూములు చట్టం చేశారన్నారు. తద్వారా అసైన్డ్ భూములు అమ్మరాదని, లీజుకు ఇవ్వరాదని, పేరు మార్పిడి చేయరాదని, ఎలాంటి కట్టడాలు, నిర్మాణాలు చేయరాదని నిబంధనలు తీసుకువచ్చారని వివరించారు. 1977 చట్టం వల్ల అసైన్డ్ భూముల పట్టాలను పొందిన ఓనర్స్ ఆ భూములపై హక్కులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం పేద రైతుల నుంచి తీసుకున్న భూములకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. కొందరు అసైన్డ్ భూములను కోల్పోయారని, వాటిని తిరిగి యజమానులకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బింగి రాములు, సుదర్శన్‌బాబు, ఉప్పరి శ్రీనివాస్, శంకర్, విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి జరుపుకోవాలి

● సూరారం ఎస్‌హెచ్‌ఓ సుధీర్‌కృష్ణ



గాజులరామారం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితిని ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూరారం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సుధీర్‌కృష్ణ అన్నారు. పీఎస్ పరిధిలో ఇప్పటికే 200 దర ఖాస్తులు వచ్చాయని, వినాయ మండపాలు ఏర్పాటు చేసే వారు పోలీసుల సూచనలు, సలహాలు పాటిస్తే ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగదన్నారు.. మండపాలను రోడ్డుకు 3 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేయాలని, విద్యుత్ అధికారుల అనుమతితో మాత్రమే మండపాలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చుకోవాలన్నారు. విగ్రహాలను మండపానికి తెచ్చేటప్పుడు, నిమజ్జనానికి తరలించే సమయంలో విద్యుత్ తీగలకు తాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 24 గంటలూ మండపంలో ఒకరు నిఘా ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే, తాత్కాలికంగా సీసీ కెమెరాలను అమర్చుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా పండుగను జరుపుకోవాలని, ఎట్టి పరిస్థితిలోనూ విగ్రహాల వద్ద డీజేలకు అనుమతులు లేదని ఎస్‌హెచ్‌ఓ సుధీర్‌కృష్ణ స్పష్టం చేశారు.



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్ కృష్ణారెడ్డి

ఆత్మరక్షణకు కరాటే ఉపయోగకరం

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. కొంపల్లి పురపాలక సంఘం మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్లో ఖేలో ఇండియా అస్మిత ఉమెన్స్ తైక్వాండో లీగ్ 2025ను అసోసియేషన్ ఏర్పాటు చేసిన కరాటే పోటీలను ఆయన కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ పోటీల్లో రెండు వందల మంది చిన్నారులు పాల్గొని, తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు కృష్ణ, జనరల్ సెక్రటరీ మీర్ వహజ్‌ఖాన్, కోశాధికారి మారుతి, రాహుల్, గణేష్‌,నరేష్, సంతోషి పాల్గొన్నారు.



చిన్నారికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

విశ్వకర్మకాలనీలో ఉచిత వైద్యశిబిరం

షాపూర్‌నగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సూరారం డివిజన్ విశ్వకర్మకాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గైనకాలజీ, చిన్నపిల్లల విభాగం వైద్యులు పరీక్షలు నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో కాలనీలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతో వ్యాధి సోకితే చేయించుకోవాల్సిన చికిత్సను వివరించారు. ఈ శిబిరంలో 60మంది చిన్నపిల్లలు, 150 మంది పెద్దలు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, ఆర్గనైజర్లు, విశ్వకర్మకాలనీ నాయకులు పాల్గొన్నారు.

ఇలాగైతే విద్యుత్ ఆదా ఎలా?

● పగలే వెలుగుతున్న వీధి దీపాలు



పగలే వెలుగుతున్న వీధి దీపాలు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వీధి లైట్లు పగలే వెలుగుతున్నాయి. డివిజన్‌లోని రంగారెడ్డినగర్‌లో ఆదివారం పగలే విద్యుత్ దీపాలు వెలుగుతూ కనిపించాయి. ఉదయాన్నే వాటిని బంద్ చేయాల్సిన వారు తమ విధులను నిర్లక్ష్యం చేయడంతో ఎక్కడ చూసినా లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. కరెంట్‌ను ఆదా చేయాలని ప్రజలకు సూచించే అధికారులే ఇలా వీధి దీపాలు అన్ని వేళల్లో వెలుగుతూ కరెంట్ వృథా అవుతున్నా పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వీధి లైట్లను సాయంత్రం 6 గంటలకు ఆన్ చేసి, ఉదయం 6 గంటలకు ఆఫ్ చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలో..

కుత్బుల్లాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : డివిజన్ పరిధిలోని పద్మానగర్ ఫేజ్-2, అంబేడ్కర్‌నగర్, తదితర ప్రాంతాలలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కన్పిస్తుంది. ప్రతి రోజు వీధి లైట్లు వెలుగుతూనే ఉన్నాయని, టైమర్లు లేకపోవడంతో రాత్రి, పగలు వెలుగుతున్నాయని స్థానికులు తెలుపుతున్నారు. దీని వల్ల విద్యుత్ దుర్వినియోగం అవుతుందని, టైమర్లు ఏర్పాటు చేసి సమయానికి లైట్లు వచ్చిపోయేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



పద్మానగర్ రింగురోడ్డు శ్వేత వుడ్ వర్క్స్ సమీపంలో ..



మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కొలన్ హన్మంత్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్

కార్యాలయ ప్రారంభోత్సవానికి తరలిన కాంగ్రెస్ నాయకులు

దుండిగల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జ్ బండిరమేష్ , మేడ్చల్ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్, ఉప్పల్ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, కార్యకర్తలు హాజరయ్యారు. వీరితో పాటు ఏఐసీసీ ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, కార్యకర్తలు తరలివెళ్లారు.

రోడ్డుపై గుంతలతో ఒళ్లు హూనం!

వర్షాలకు దెబ్బతిన్న అంతర్గత రహదారులు

●గుంతల వల్ల ప్రయాణికులకు నడుంనొప్పి

● ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్ర వాహనదారులు



ఎస్ఆర్ రెసిడెన్సీ సమీపంలో శిథిలమైన రోడ్డు



ఆర్ఎస్‌కే స్కూల్ మూల మలుపులో పాడైపోయిన రోడ్డు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో అంతర్గత రహదారులు శిథిలావస్థకు చేరి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయి గుంతలమయంగా మారిన కాలనీ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. గుంతల్లో ప్రయాణిస్తుండటం వల్ల ఒళ్లు హూనమైపోతోందని, నడుం నొప్పి వస్తోందని, వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. కంకర తేలిన రోడ్ల కారణంగా కొందరు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. బాపూనగర్‌లోని ఆర్ఎస్‌కే స్కూల్ రోడ్ నెంబర్ 5 మూల మలుపు, బాలొరెడ్డినగర్‌లోని ఎస్ఆర్ రెసిడెన్సీ ఎదురుగా, రామకృష్ణానగర్‌లోని గాంధీ విగ్రహం సమీపంలో గుంతలు పడి రోడ్డు మరింత అధ్వానంగా మారింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రామకృష్ణానగర్ గాంధీ విగ్రహం వద్ద గుంతలుగా మారిన రోడ్డు



పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న నీరు

తాగునీరు రోడ్డు పాలు - పట్టించుకోని అధికారులు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పైప్‌లైన్ పగిలి తాగు నీరు వృథాగా రోడ్డుపై పారుతోంది. రంగారెడ్డినగర్ డివిజన్ పంచశీల కాలనీకి వెళ్లే రహదారిలో పైప్‌లైన్ నుంచి 15 రోజులుగా తాగు నీరు వృథాగా పోతున్నదని జలమండలి సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తమ కాలనీలకు తాగునీరు సరిగా సరఫరా కావడం లేదని ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతుంటే లీకేజీలను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగు నీరును వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని పంచశీల కాలనీ కోరుతున్నారు.

నిల్వ నీరు తొలగిపోయేలా చర్యలు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : చింతల్ రేణుకాఎల్లమ్మ ఆలయం నుంచి వేంకటేశ్వర నగర్ వెళ్లే ప్రధాన మార్గంలో మహేంద్రనగర్ వద్ద రోడ్డు పక్కన వర్షం నీరు నిలిచి అక్కడున్న చెత్త కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. దీంతో స్థానికులు, ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు పడుతున్న అవస్థలను తెలియజేస్తూ ఈనెల 24న 'కుళ్లిన చెత్త... దుర్వాసనతో అవస్థలు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన మున్సిపల్ అధికారులు రోడ్డుపై ఉన్న నిల్వ నీరు తొలగిపోయేలా సిబ్బందితో మరమ్మతు చేయించారు. సమస్యను పరిష్కరించేందుకు సహకరించిన ఆంధ్రజ్యోతికి స్థాని కులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రోడ్డుపై ఉన్న నిల్వ నీరు వెళ్లిపోయేలా మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

'డబుల్' ఇళ్లలో మౌలిక సదుపాయాలు

●ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హామీ

గాజులరామారం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారంలోని రాజీవ్‌గృహకల్ప, రెండు పడకల ఇళ్ల నివాసితులు స్థానికంగా నెలకొన్న సమస్యలపై పేట్‌బషీరాబాద్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రార్థనా మందిరాలు, ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. స్పందించిన ఆయన స్థానికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో షేక్‌సాజీద్, వేణు, సైదుల, నాయుడు, లక్ష్మి, ప్రమీల, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మరో కార్యక్రమంలో ...

గాజులరామారం డివిజన్ ఆదర్శనగర్‌లోని పోచమ్మ ఆలయం 15వ వార్షికోత్సవంలో ఆదివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మ దయ ఉంటె అన్నీ ఉన్నట్లేనని, అమ్మవారి కృపా కటాక్షాల కోసం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రజలందరిపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో గోపాల్, శ్రీకాంత్‌రెడ్డి, చారి, శ్రీనివాస్‌యాదవ్, బాలరాజు, తెలంగాణ సాయి, పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసిన డబుల్ బెడ్రూమ్‌వాసులు

చెస్ విజేతలు దీక్షిత, దివిత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ అండర్-13 చెస్ పోటీల బాలికల విభాగంలో దీక్షిత, బాలుర విభాగంలో దివిత్ రెడ్డి విజేతలుగా నిలిచారు. ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో జరిగిన ఈ పోటీల్లో సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో దివిత్ రెడ్డి టైటిల్ దక్కించుకోగా, కార్తికేయ రన్నరప్‌గా నిలిచాడు. బాలికల విభాగంలో దీక్షిత విజేతగా నిలవగా, శ్రీషా రన్నరప్‌తో సరిపెట్టుకుంది. హైదరాబాద్ చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ వీరికి ట్రోఫీలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



ట్రోఫీలతో క్రీడాకారులు

పీవోటీ-1977 చట్టాన్ని రద్దు చేయాలి

● అనుభవిస్తున్న వారికే అసైన్డ్ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలి

● తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రోళ్ల శివయ్య

రాంనగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): 1977 పీవోటీ చట్టాన్ని రద్దుచేయాలని, అసైన్డ్ భూములు కలిగిన వారికే ఆ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలని తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్డ్ భూముల్లో సమాన హక్కులను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు దాదాపు 16 లక్షల కుటుంబాలకు సంబంధించినవిగా ఉన్నాయన్నారు. పేదప్రజలకు పంపిణీచేసిన అసైన్డ్ భూములకు భద్రత కల్పిస్తామంటూ 1977లో అసైన్డ్ భూములు చట్టం చేశారన్నారు. తద్వారా అసైన్డ్ భూములు అమ్మరాదని, లీజుకు ఇవ్వరాదని, పేరు మార్పిడి చేయరాదని, ఎలాంటి కట్టడాలు, నిర్మాణాలు చేయరాదని నిబంధనలు తీసుకువచ్చారని వివరించారు. 1977 చట్టం వల్ల అసైన్డ్ భూముల పట్టాలను పొందిన ఓనర్స్ ఆ భూములపై హక్కులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం పేద రైతుల నుంచి తీసుకున్న భూములకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. కొందరు అసైన్డ్ భూములను కోల్పోయారని, వాటిని తిరిగి యజమానులకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బింగి రాములు, సుదర్శన్‌బాబు, ఉప్పరి శ్రీనివాస్, శంకర్, విజయ్‌బాబు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులను శాలువాతో సన్మానిస్తున్న భాస్కర్

కాలనీ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలి

షాపూర్‌నగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఎన్నికైన అసోసియేషన్ సభ్యులు కాలనీ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూరారం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ అన్నారు. డివిజన్ పరిధిలోని టీఎస్ఐఐసీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన నూతన కమిటీ సభ్యులు భాస్కర్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కమిటీ అధ్యక్షుడు నేతి రాజా, ఉపాధ్యక్షుడు గోపి యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గిరిధర్, కోశాధికారి కృష్ణమూర్తిలను భాస్కర్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు చెక్క సురేష్‌బాబు, కమిటీ కార్యనిర్వాహక వర్గం సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి: సీపీఎం

షాపూర్‌నగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ కోరారు. సీపీఎం మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం షాపూర్‌నగర్ పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సభ్యుడు పి. అంజయ్య అధ్యక్షతన పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఒకటిన్నర సంవత్సరం అవుతున్నా ప్రజలకిచ్చిన హామీలు అమలు పర్చలేదని, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, కొత్తగా దరాఖాస్తు చేసుకొన్న వారికి పెన్షన్ల మంజూరు చేయలేదని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు, కార్యక్రమంలో కమిటీ సభ్యులు కరుణాకర్, భాష, తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు బాలకృష్ణ ఎంపికపై హర్షం

షాపూర్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, ఎమ్మెల్యే, బసవతారకం ఆసుపత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడంపై టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె. దశరథ్ హర్షం వ్యక్తం చేశారు. నటుడిగా సినీ కళామ్మతల్లికి 50 ఏళ్లుగా చేస్తున్న సేవలు, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా నిరుపేదలకు వైద్యం అందించడంతో పాటు హిందూపూర్ ఎమ్మెల్యేగా చేస్తున్న ప్రజాసేవను గుర్తించి బాలకృష్ణను వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు ఎంపిక చేయడం శుభపరిణామమని దశరథ్ పేర్కొన్నారు.



బీహెచ్ఎల్ విస్టాలో మురుగు కాలువను పరిశీలిస్తున్న భరత్ సింహారెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● బీజేపీ నేత భరత్ సింహారెడ్డి

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని రాఘవేంద్ర కాలనీ బీహెచ్ఎల్ విస్టాలో ఆయన పర్యటించారు. కాలనీలో రోడ్లు, పార్కులో చెత్త పేరుకుపోయిందని, రోడ్లపై వర్షపు నీరు నిలుస్తోందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా భరత్ సింహారెడ్డి మాట్లాడుతూ, కాలనీలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానికులు మంజునాథ్‌రెడ్డి, వంశీకృష్ణ, ప్రియాంకరావు, రామకృష్ణారెడ్డి, బీవీ నారాయణ, సతీష్, ఉమాపతిరావు, శ్రీనివాస్, కోటేశ్వరరావు, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.



నిందితులతో ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బృందం

డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం

● పలు ప్రాంతాల్లో దాడులు చేసిన ఎక్సైజ్ అధికారులు

● కొకైన్, ఎండీఎంఏ స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ విక్రేతలపై వరుస దాడులు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు నగరంలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో కొకైన్, ఎండీఎంఏ విక్రయిస్తున్న ముఠాలను అరెస్ట్ చేశారు. నాంపల్లి రామ్‌కోట్ ప్రాంతానికి చెందిన మిస్బావుద్దీన్ ఖాన్(35), బంజారాహిల్స్‌కు చెందిన అలీ అస్గర్ గులాబీ (28) బెంగళూరుకు చెందిన మహ్మద్ అజీమ్ వద్ద కొకైన్ కొనేవారు. వీరు బెంగళూరు వెళ్లి అజీమ్ నుంచి గ్రాము కొకైన్ రూ.9వేలకు తెచ్చుకొని, నగరంలో పార్టీలు చేసుకునేవారు. బెంగళూరు వెళ్లి కొకైన్ తెచ్చుకునేందుకు నెల రోజుల క్రితం నగరానికి వచ్చిన అమెరికన్ సిటిజన్ జుబేర్ అలీ కారును తీసుకున్నారు. బెంగళూరులో కొకైన్ తీసుకొని నగరానికి వచ్చిన వీరి గురించి తెలుసుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సిబ్బంది రామ్‌కోట్ ప్రాంతంలో కారును అడ్డుకున్నారు. మిస్బావుద్దీన్, అలీ అస్గర్, జుబేర్ అలీలను అరెస్ట్ చేసి 33.3 గ్రాముల కొకైన్, 4 మొబైల్స్, ఇన్నోవా క్రిస్టా కారును స్వాధీనం చేసుకున్నారు.

ఖాజాగూడ, శంషాబాద్‌లో ఎండీఎంఏ..

ఖాజాగూడలో ఎండీఎంఏ విక్రయించేందుకు యత్నిస్తున్న నాగుల్ల శివపవర్, దేవట్ట మనోజ్, శ్రీవర్ధన్‌ను ఎస్‌టీఎఫ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. వారి నుంచి 2.07 గ్రాముల ఎండీఎంఏ, రెండు యాక్టివా బైకులు, మూడు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. వీరికి సరఫరా చేసే అలీ పరారీలో ఉన్నాడని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. శంషాబాద్‌లో డ్రగ్స్ విక్రయాలపై నిఘా పెట్టిన ఎక్సైజ్ అధికారులు అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఖయ్యూం నగర్‌కు చెందిన మిర్జాసైఫ్‌అలీ, అత్తాపూర్‌కు చెందిన అబ్దుల్ అబిద్‌ను తనిఖీ చేశారు. వారి వద్ద 5.88 గ్రాముల ఎండీఎంఏ లభించడంతో వారిని అరెస్ట్ చేశారు. మరో నిందితుడు సయ్యద్‌అబ్దుల్ హసన్ పరారీలో ఉన్నాడు.